క్లుప్తంగా

కళ్ల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి


శిబిరంలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

కర్నూలు(సెంట్రల్): ప్రతిఒక్కరూ కళ్ల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, భరత్ హాస్పిటల్ కంటి వైద్యురాలు డాక్టర్ కె.స్వాతి పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, భరత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్‌లోని భగత్ సింగ్ గ్రంథాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. కళ్ల సంరక్షణ కోసం పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటివి తినాలని సూచించారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు ఆర్.నరసింహులు, వెంకటేశ్వర్లు, కేవీ జనార్ధన్ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు అక్బర్ బాషా మృతి



కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగస్థల కళాకారుడు అక్బర్ బాషా అనారోగ్యంతో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయన కర్నూలు జిల్లా రంగస్థల వేదికలపై 800 సార్లు ఆంజనేయ స్వామి పాత్రను పోషించి భళారే అనిపించుకున్నారు. ఈయన మృతికి కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు చౌదరి, కార్య నిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీయుల్లా, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కళా వాహిని సాహితీ సంస్థ అధ్యక్షులు మనోహర్‌బాబు, శ్రీశైలం భ్రమరాంబ కళా సమితి అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు సంతాపం ప్రకటించారు. అక్బర్ బాషా మృతి కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

2న ఆరోగ్య అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్):మత్తు పదార్థాల వ్యసనం వల్ల కలిగే అనర్థాలపై ఈ నెల 2వ తేదీన ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, ఇందులో నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఇక్రముల్లా ప్రసంగిస్తారన్నారు.

నలుగురు క్లర్క్‌లకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న నలుగురు క్లర్క్‌లకు (సీనియర్ అసిస్టెంట్లు) ఆఫీస్ సూపరింటెండెంట్లుగా పదోన్నతి లభించింది. శుక్రవారం కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఆర్‌డీ డాక్టర్ వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ప్రాంతీయ శిక్షణ కేంద్రం (మేల్)లో పనిచేస్తున్న కె.శ్రీనివాస్ నర్సింగ్ కాలేజీకి, గడియారం ఆసుపత్రిలో పనిచేస్తున్న సత్యనారాయణరాజు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు, ఆస్పరి పీహెచ్‌సీలో పనిచేస్తున్న బాలస్వామి ప్రాంతీయ కంటి ఆసుపత్రికి, జిల్లెల్ల పీహెచ్‌సీలో పనిచేస్తున్న సాయిప్రసాద్ నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు కల్చరల్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3, 4, 5 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా వైజ్ఞానిక తరగతులను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌యూ వద్ద కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ నాయకులు సాయి, ప్రసాద్, తేజ, నరేష్, అభి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని ఢణాపురం సమీపంలో శుక్రవారం ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఈరన్న, వీరేష్, హనుమాన్‌నగర్‌కు చెందిన వసంత ఢణాపురం నుంచి ఆటోలో ఆదోనికి వస్తున్నారు. ఢణాపురం సమీపంలో అడ్డువచ్చిన కుక్కను తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడినట్లు ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపారు.

వైభవంగా సహస్ర కమలార్చన



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి, లలితా సుందరేశ్వరి అమ్మవార్లు


సహస్ర కమలార్చన నిర్వహిస్తున్న దృశ్యం


గాజుల అలంకరణలో నిమిషాంబ అమ్మవారు


సామూహిక నక్షత్ర శాంతి పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తగిరి నగర్ చౌడేశ్వరీ దేవి ఆలయంలో పంచామృతాభిషేకం, లలితా సహస్రనామార్చన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. చౌడేశ్వరీ దేవి అమ్మవారికి 1,516 తామర పూలతో భక్తిశ్రద్ధలతో అర్చన నిర్వహించారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సామూహిక నక్షత్ర శాంతి పూజలు నిర్వహించారు. లలితా సుందరేశ్వరికి అభిషేకం, అర్చనలు చేశారు. సామూహిక దీపార్చన చేశారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. లలితా సంఘం అధ్యక్షులు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఓల్డ్‌సిటీ నిమిషాంబ దేవి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నిమిషాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



కల్యాణ మూర్తులుగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కమనీయం కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి కళాక్షేత్రం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య మంగళ కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. అంతకుముందు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవాన్ సత్యసాయి సేవలు మరువలేనివన్నారు. ఆయన బోధనలు, ప్రవచనాలు ఎంతో మంది జీవితాల్లో మార్పులు తెచ్చాయని వివరించారు. సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, సీనియర్ సేవాదళ్ రామ్మోహన్, జిల్లా మహిళా సేవాదళ్ ఇన్‌చార్జ్ లక్ష్మీసరోజ, మహిళా కన్వీనర్ సంధ్య, యూత్ కన్వీనర్ సందీప్, సభ్యులు సప్తపతి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

- యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన


నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం తీసుకొచ్చిన యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ స్పష్టం చేశారు.ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పెన్షన్ విధా నం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదన్నారు. పెన్షన్ పొందడానికి 20 సంవత్సరాలు సరిపోతుందని,కొత్త విధానంలో మాత్రం 20 ఏళ్ల సర్వీసు నిర్ణయించడం అన్యాయ మన్నారు. దశాబ్దాల పాటు సేవ చేసే ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం హక్కు అన్నారు. యునిఫైడ్ పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహ అధ్యక్షుడు హేమంత్‌కుమార్, నాయకులు జయరాజు, తిమ్మన్న, దుర్గా ప్రసాద్,మారెప్ప, హనుమంతు, కాంతారావు, సోమన్న, హనుమన్న పాల్గొన్నారు.

రోడ్డును బాగుచేయాలని నిరసన



రోడ్డుపై బురద నీటిలో దిగి నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండలంలోని జి.శింగవరంలో పెండింగ్‌లో ఉండి గుంతలు పడిన కర్నూలు–సుంకేసుల రోడ్డును పూర్తిచేయాలని డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ గ్రామంలో రోడ్డుపై గుంతల్లోని బురద నీటిలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ.. గ్రామంలో రోడ్డు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయని, గుంతల కారణంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డును బాగు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తారు. డీవైఎఫ్‌ఐ నాయకులు అబ్దుల్లా,ప్రకాష్,అంజి,సురేష్, వంశీ, నరేష్, రాము, హరి రాజు, సుధాకర్, శ్రీనివాసులు, విశ్వనాథ్, స్థానికులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యం మెరుగుపరుచుకోవాలి


శిక్షణలో పాల్గొన్న వైద్యులతో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యాబోధకులు నిరంతరం తమ టీచింగ్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో శుక్రవారం ఎన్ఎంసీ గైడ్‌లైన్స్ మేరకు ఎంఈయూ కో–ఆరి ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బోధకులు తమ స్కిల్స్ మెరుగుపరుచుకుంటే వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, అందుకే నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని సూచించారు. నోడల్ సెంటర్ భాస్కర మెడికల్ కాలేజీ నుంచి అబ్జర్వర్‌గా డాక్టర్ సాజియా పర్వీన్ హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, ఎంఈయూ సభ్యులు డాక్టర్ విజయానందబాబు, డాక్టర్లు లక్ష్మి, విశాల, అరుణ, కుముద, భానుప్రకాష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ గుంతలమయం


అశోక్ నగర్, నరసింహా రెడ్డి కాలనీలలో రోడ్లపై గుంతలు

కర్నూలు (టౌన్): నగరంలోని అశోక్‌నగర్, నరసింహారెడ్డి నగర్ రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీల్లో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఉన్నాయి. వరుసగా పడుతున్న వర్షాలతో గుంతలు కాస్త గోతులుగా తయారయ్యాయి. రైల్వేస్టేషన్ నుంచి అశోక్‌నగర్ బ్రిడ్జి వరకు సమస్య తీవ్రంగా ఉంది. ఆ మార్గంలో అశోక్‌నగర్, నరసింహారెడ్డి నగర్, వెంకటరమణ కాలనీ, రామలింగేశ్వర్ నగర్, బంజారా కాలనీ, టీచర్స్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, లేబర్ కాలనీ ఇలా అనేక కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీ రోడ్లు నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలతో రద్దీగా ఉంటాయి. అయితే అడుగడుగునా గుంతలు ఉండడంతో ప్రజలు, వాహనాదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. రాత్రి వేళ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. మున్సిపల్ అధికారులు ఇదే రహదారిలో వెళుతున్నా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్లపై గుంతలను పూడ్చాలని స్థానిక కాలనీల వాసులు కోరుతున్నారు.

మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత


మొక్కను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్


మొక్కను నాటి నీరు పోస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు విక్రమసింహారెడ్డి


మొక్కలు నాటుతున్న బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, డీవీఈఓ పరమేశ్వరరెడ్డి

కర్నూలు సిటీ: ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా ఒక మొక్కను నాటి సంరక్షిస్తే వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి పెరిగి ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ప్రభుత్వ వొకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్ అన్నారు. శుక్రవారం ఆ కాలేజీలో జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాల సందర్భంగా మొక్కలు నాటాలని, ఆ మొక్క భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తుందన్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను కోట్లు ఖర్చు పెట్టినా తీసుకోలేమన్నారు. కాలేజీ అధ్యాపకుల చేతను మొక్కలు అందించి నాటించారు. కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): ప్రకృతిలో భాగమైన చెట్లను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు, 40వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెంకటరమణ కాలనీ కొత్త బ్రిడ్జి వద్ద ఆయన మొక్కలు నాటారు.గతంలో దిబ్బగా ఉన్న ఈ ప్రాంతా న్ని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా క్లీన్ చేయించిన ఆయన మాట్లాడుతూ.. వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రతి ఏరియాలో క్లీన్ అండ్ గ్రీన్ పాటిస్తున్నామన్నారు.చెట్లు ప్రగతికి మెట్లు అన్ననానుడిని నిజం చేయాలన్నారు. జీవరాశులన్నీ చెట్ల మీద ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. మొక్కలను నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు.సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కేవీఆర్‌లో వన మహోత్సవం

కర్నూలు సిటీ: స్థానిక కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో వన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఇంటర్మీడియెట్ బోర్డు డీవీఈఓ పరమేశ్వరరెడ్డి పాల్గొని జూనియర్, డిగ్రీ కాలేజీల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలన్నారు. నాటిని ప్రతి మొక్కను సంరక్షిస్తే అవి మనల్ని ఆరోగ్యవంతులుగా ఉంచేందుకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయన్నారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు డాక్టర్ వి.వి.ఎస్ కుమార్, లాలెప్ప, లయన్స్ క్లబ్ చైర్మన్ శివరాం గౌడ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి 'స్పర్శ్'

- బ్రిగేడియర్ వెంకటరెడ్డి


కార్యక్రమానికి హాజరైన బ్రిగేడియర్ వెంకటరెడ్డి, ఇతర అధికారులు

కర్నూలు (అర్బన్): మాజీ సైనికుల పెన్షన్, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 'స్పర్శ్' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బి.క్యాంప్‌లోని టీజీ లక్ష్మీవెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో స్పర్శ్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ తెలంగాణ–ఆంధ్ర సబ్ ఏరియా కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ విభాగం, ఆర్మీ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన మాజీ సైనికులు, వీరనారీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని మాజీ సైనికులు, వీరనారీల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ ద్వారా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, రికార్డు ఆఫీసులు, రెజిమెంట్ల కార్యాలయ అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే సికింద్రాబాద్ ఆర్మీ సీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరిగిందన్నారు. మాజీ సైనికుల సేవే పరమావధిగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయాలు పనిచేస్తున్నాయన్నారు. సైనిక సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, కేంద్ర సైనిక్ బోర్డు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీఏ సీనియర్ ఏఓలు చంద్రశేఖర్, రమణరావు, కర్నూలు, అనంతపురం జిల్లాల సైనిక సంక్షేమ శాఖ అధికారులు రత్నరూత్, తిమ్మప్ప, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నర్రా పేరయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ బాబుప్రసాద్

ఓర్వకల్లు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో మోటార్ సైకిళ్లను దొంగలించి తప్పించుక తిరుగుతున్న దొంగను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐ చంద్రబాబునాయుడితో కలిసి డీఎస్పీ బాబు ప్రసాద్ నిందితుడి అరెస్టును చూపించారు. డీఎస్పీ, సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో నివాసముంటున్న యువకుడు షేక్ మహ్మద్ వలి జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు వృత్తిగా ఎంచుకున్నాడన్నారు. పోలీసుల కళ్లుకప్పి తప్పించుక తిరుగుతుండేవాడు. అతనిపై పోలీసు స్టేసన్‌లలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు. మండలంలోని జాతీయ రహదారిపై బేతంచెర్ల క్రాస్‌రోడ్డుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్‌వలిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని విచారించగా నేరాలు అంగీకరించారు. నిందితుడి సమాచారం మేరకు నాలుగు పల్సర్ మోటార్ సైకిళ్లు, ప్యాషన్‌ప్రో బైక్, హీరోసీడీ డాన్ మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని కోర్టుకు తీసుకెళ్లగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సునీల్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామస్తులు వద్దన్నా పరిశ్రమ ఏర్పాటు తగదు

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటును గ్రామస్తులంతా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం ముందుకు వెళ్లాలనుకోవడం భావ్యం కాదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదివరకే గ్రామానికి సంబంధించిన భూముల్లో డీఆర్‌డీఓను ఏర్పాటు చేయడంతో సగానికి పైగా భూములను అందుకు కేటాయించారని గుర్తుచేశారు. మిగతా భూముల్లో గ్రీన్‌కో సోలార్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు పూనుకోవడం అన్యాయమని వాపోయారు. ప్రభుత్వం మరో ప్రత్యామ్నాయ ప్రాంతంలో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.